
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం | 7 | జులై | 2025



గండి టెండర్లలో నిబంధనలకు పాతర

గండి క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా నిర్వహించే టెండర్లలో నిబంధనలకు పాతర వేసినట్లు కనిపిస్తోంది.

-8లో



అనంతపురం జట్టు ఘన విజయం

ఏసీఏ అండర్-19 మల్టీ డే మ్యాచ్‌లో ఆదివారం మూడవ రోజు కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు 59 పరుగులతో ఘన విజయం సాధించింది.

-8లో

గరిష్టం/కనిష్టం
36.2/28.0

వాతావరణం

జిల్లాలో ఆదివారం 28.0 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 32.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

సభాభవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562- 244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో సూచించారు.

నేటి నుంచి మంత్రి పర్యటన

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత రెండు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి సవిత సోమవారం ఉదయం పులివెందులలో స్థానిక ప్రజాప్రతినిధులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం లింగాలలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జరిగే విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం కడప నగరంలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి కడప ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ బస చేయనున్నారు. 8వ తేది ఉదయం కమలాపురం నియోజకవర్గం చెన్నూరు మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగే జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. సాయంత్రం మంత్రి రోడ్డు మార్గాన గుంటూరుకు బయలుదేరుతారని పేర్కొన్నారు.

హంసవాహనంపై సౌమ్యనాథుడు



హంసవాహనంపై ఊరుగుతున్న సౌమ్యనాథుడు

నందలూరు: ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధి చెందిన నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడోరోజు ఆదివారం ఉదయం పల్లకీసేవ జరిగింది. సౌమ్యనాథుడు మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాన్ని అర్చకులు సునీల్‌కుమార్, పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్ కుమార్, సాయిస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి హంసవాహనంపై సరస్వతీదేవి అలంకారంలో స్వామివారు దేవేరులతో కలిసి మాడవీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించారు.

పుత్తా రాసిన కాలువ కథ!

- మెలికలు తిరిగిన ఎస్‌బీఐ కాలనీ వరద కాలువ
- పుత్తా ఎస్టేట్ పక్కనుంచి కాకుండా మరియాపురం మీదుగా మార్పు
- ఉన్న కల్వర్టులోంచి కాకుండా కొత్త కల్వర్టు పంపేందుకు అదనపు వ్యయం
- ఎక్కువ వరద వస్తే మరియాపురం ముంపునకు గురయ్యే ప్రమాదం



ఎస్‌బీఐ కాలనీ వద్ద ఆగిపోయిన వరద కాలువ నిర్మాణం (కొత్త కల్వర్టు నిర్మించేది ఇక్కడే)



విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన నిర్మిస్తున్న వరద కాలువ

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికార బలం, దర్పం ముందు వరదనీటి కాలువ చిన్నబోయింది. వారి అంగబలం, అర్థబలానికి మనుషులే కాదు కాలువలు, రోడ్లు కూడా భయపడి పక్కకు తప్పుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. కడప నగరంలో ఎస్‌బీఐ కాలనీలో నిర్మిస్తున్న వరద కాలువ అధికార పార్టీ నేతలకు జడిసి అనేక మెలికలు తిరుగుతోంది. వివరాల్లోకి వెళితే..

- చౌటపల్లె కాలువ నుంచి నంద్యాల నాగిరెడ్డి కాలనీ, అల్లూరి సీతారామరాజు నగర్, విద్యానగర్, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిని ఎస్‌బీఐ కాలనీ, బిల్టప్ మీదుగా బుగ్గవంకలోకి కలపాలనే సంకల్పంతో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో రూ.4కోట్లతో వరదకాలువ నిర్మించారు. ఎస్‌బీఐ కాలనీ వద్ద పుత్తా ఎస్టేట్ వద్దకు వచ్చేసరికి దానికి బ్రేక్ పడింది. నేషనల్ హైవే పక్కనుంచి బిల్టప్ వరకూ కాలువ నిర్మించాలంటే తమకు నష్ట పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి తేల్చిచెప్పడంతో కాలువను అక్కడితో ఆపేసినట్లు సమాచారం. పుత్తా ఎస్టేట్ మీదుగా బిల్టప్ వరకూ కాలువ నిర్మిస్తే బిల్టప్ వద్ద ఇదివరకే ఉన్న కల్వర్టులోంచి నీటిని పంపేందుకు వీలుంటుంది. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కాలువ అంచనా వ్యయాన్ని మరో రూ.75లక్షలు పెంచి జాతీయ రహదారిని పగులగొట్టి అలైన్‌మెంట్ మార్చారు. దీనివల్ల కొత్తగా కల్వర్టు నిర్మించడానికి మరో రూ.75లక్షలు అదనంగా ఖర్చు చేస్తున్నారు. కడప- కర్నూల్ జాతీయ రహదారిని పగులగొట్టి కల్వర్టు నిర్మిస్తే సుమారు నెల రోజులకు పైగా ఈ మార్గంలో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పవు. ప్రజలను ఇన్ని ఇబ్బందులు పెట్టి, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి నిర్మిస్తున్న కాలువ వారి అవసరాలను ఏమాత్రం తీరుస్తుందో వేచిచూడాలి.

కోనేరును కలిపేసుకున్నా తీరని దాహం

బిల్టప్ వద్ద పుత్తా ఎస్టేట్ ఉన్న ప్రాంతంలో గతంలో కోనేరు ఉండేదని గ్రామ పంచాయితీ రికార్డుల్లో స్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆ కోనేరును తమ స్థలంలో కలిపేసుకున్న అధికార పార్టీ నేతలు....రోడ్డు పక్కనుంచి వరదనీటి కాలువను నిర్మించేందుకు అంగీకరించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ ఎస్టేట్ పక్కనుంచి కాలువ నిర్మిస్తే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరే కాకుండా ఎస్టేట్‌లో పడిన నీరు కూడా ఆ కాలువ ద్వారా వెళ్లేందుకు ఆస్కారం ఉంటుంది. కానీ అధికార పార్టీ నేతలు ఎస్టేట్ పక్కనుంచి కాకుండా నేషనల్ హైవేను పగులగొట్టి మరియాపురం వైపునున్న కాలువలో కలిపేలా అధికార బలాన్ని ఉపయోగించినట్లు తెలుస్తోంది. అసలే మరియాపురం లోతట్టు ప్రాంతంలో ఉంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఎగువ నుంచి వచ్చే వరదనీరు వెల్లువలా వస్తే అనేక వంపులు తిరిగి ఉన్న ఈ కాలువలో ప్రవహించడం కష్టమేనని ఇంజినీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. దీనివల్ల అటు పైనున్న ప్రాంతాలు, దిగువన ఉన్న మరియాపురంలోకి వరదనీరు పోటెత్తి ముంచెత్తే ప్రమాదం లేకపోలేదు.



కౌన్సిల్ ఆమోదం మేరకే కాలువ నిర్మాణం: ఎస్ఈ

కడప నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఆమోదం మేరకు ఎస్‌బీఐ కాలనీలో నిర్మిస్తున్న కాలువ అలైన్‌మెంట్ మార్చామని ఎస్ఈ చెన్నకేశవరెడ్డి తెలిపారు. అలైన్‌మెంట్ మార్చడం వల్ల మరియాపురం ముంపునకు గురికాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నోరు మెదపని ప్రభుత్వ విప్

ఎస్‌బీఐ కాలనీ నుంచి పుత్తా ఎస్టేట్ పక్కనుంచి కాలువను నిర్మించాలని గతంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులను హల్‌చల్ చేసిన ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి ఇప్పుడు నోరు మెదపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందిన వాటర్ ప్లాంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లను ఆక్రమణల పేరిట కూల్చివేయించిన ఆమె...తన సహచర టీడీపీ ఎమ్మెల్యే దగ్గరకు వచ్చేసరికి తన వరుస మార్చుకున్నారని ఆరోపణలొస్తున్నాయి. చిన్నస్థాయి నేతలపై ఆమె ప్రతాపం చూపిస్తుందే తప్పా...అందరిపై కాదని దీన్నిబట్టి అర్థమవుతోంది.

నేడు వైఎస్ జగన్ రాక

సోమవారం సాయంత్రం పులివెందులకు చేరుకోనున్న మాజీ సీఎం



పులివెందుల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేటి నుంచి రెండు రోజులు జిల్లాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 5గంటలకు ఆయన హెలీకాప్టర్ ద్వారా పులివెందులలోని భాకరాపురంలో ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. ఆ రోజు రాత్రి పులివెందులలోనే బస చేయనున్నారు. మంగళవారం ఉదయం దివంగత వైఎస్సార్ జయంతి సందర్భంగా పులివెందుల నుంచి ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడ ఉదయం 7.30గంటల నుంచి 8.15గంటల వరకు వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించనున్నారు. అనంతరం పులివెందులకు చేరుకుంటారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటలకు పులివెందుల క్యాంప్ ఆఫీస్‌లో ప్రజలతో మమేకం అవుతారు. మంగళవారం సాయంత్రం పులివెందుల భాకరాపురం హెలీప్యాడ్ నుంచి బెంగుళూరుకు బయలుదేరి వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

నియామకం

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, లా కళాశాలల పరిశీలన, పర్యవేక్షణకు కమిటీని నియమిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు తరగతులు నిర్వహించకున్నా పరీక్షలు నిర్వహిస్తోందని విద్యార్థి, ప్రజాసంఘాల నుంచి వినతులు రావడంతో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు మార్గదర్శకం మేరకు సీనియర్ ప్రొఫెసర్లతో కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కమిటీ కళాశాలలను సందర్శించి వాస్తవ స్థితిగతులు తెలియజేస్తుందన్నారు. ఆ మేరకు నివేదిక ఆధారంగా కళాశాలలపై తదుపరి చర్యలు ఉంటాయని ఆమె వివరించారు.

ఘనంగా గంధోత్సవం



దర్గా ఆవరణలో భక్తజన సందోహం

కడప సెవెన్‌రోడ్స్: కడప పెద్దదర్గా ప్రధాన గురువు హజరత్ పీరుల్లా మాలిక్ సాహెబ్ గంధోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గురువు మజార్ వద్ద విశేష ప్రార్థనలు జరిగాయి. ప్రక్క రాష్ట్రాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. దర్గా నిర్వాహకులకు ఆ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. గంధోత్సవం సందర్భంగా దర్గా విద్యుత్ దీప కాంతులతో మెరిసింది. హజరత్ పీరుల్లామాలిక్ సాహెబ్ సజీవ సమాధి అయిన సందర్భంగా ప్రతి ఏటా మొహర్రం నెల పదోరోజు గంధోత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి పవిత్ర జలాన్ని భక్తులకు అందజేశారు. లంగర్‌లో భోజన ప్రసాదం కూడా ఏర్పాటు చేశారు. భక్తులు పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్‌ను దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

నకిలీ.. మకిలీ!

వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో చేపడుతున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్స్ నియామకాల్లో బోగస్ సర్టిఫికెట్స్ వ్యవహారం కలకలం రేపుతోంది. కొంతమంది అడ్డదారుల్లో అక్రమంగా సంపాదించుకోవడానికి ఒక ముఠాగా ఏర్పడి, బోగస్ సర్టిఫికెట్లను తయారు చేస్తున్నట్లుగా సమాచారం. వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలిస్తే ఇంకెన్ని నకి'లీలలు'బయట పడుతాయో... వైద్య ఆరోగ్యశాఖకు అంటుకున్న ఈ మకిలీ ఎప్పుడు తొలగిపోతుందో అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

కడప రూరల్: కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో ఈ ఏడాది జనవరిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలకు చర్యలు చేపట్టారు. 150 పోస్టులకు గాను దాదాపు 11 వేలకు పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ కార్యాలయ సిబ్బంది వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జాబితాను సిద్ధం చేశారు.

ఎందుకైనా మంచిదని...

దరఖాస్తుల ఆధారంగా నిబంధనల ప్రకారం 200 మందితో అభ్యర్థుల తుది ఎంపిక జాబితాను సిద్ధం చేశారు. ఎందుకైనా మంచిదని ఆ శాఖ అధికారులు ఎంపికైన సదరు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలన కోసం అమరావతిలోని పారా మెడికల్ బోర్డు, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి పంపారు. ఆ మేరకు బీఎస్సీ నర్సింగ్ కు సంబంధించి 100 మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి, జిఎన్ ఎం నర్సింగ్ కోర్సు చేసిన 100 మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్ ను పారా మెడికల్ బోర్డుకు పంపారు. అందులో 27 మంది అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తుల్లో బోగస్ సర్టిఫికెట్స్ ఉన్నట్లుగా ధ్రువీకరించారు.

- ఆ 27 మందికి ఆ శాఖ కార్యాలయం నోటీసులు ఇచ్చి, ఒక వారంలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అందులో కొంతమంది అసలు తాము దరఖాస్తే చేయలేదని సమాధానం ఇవ్వడం గమనార్హం. మరి కొందరి ఇంటి చిరునామా తప్పుగా తేలింది. ఇంకొందరు అసలు సమాధానమే ఇవ్వ లేదు. దీంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి, కాగా నిబంధనల ప్రకారం మార్కులు, ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. మూడేళ్ల చొప్పున జీఎన్ఎం కోర్స్‌కు 1800, బీఎస్సీ నర్సింగ్‌కు 2,700 మార్కులు ఉంటాయి. ఉద్యోగ నియామకాల్లో ఈ మార్కులతో పాటు సర్వీస్, అకడమిక్ వెయిటేజ్ మార్కులు ఉంటాయి. ఈ మార్కుల మెరిట్‌తో పాటు ఇతర నిబంధనలను పరిగణలోకి తీసుకొని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు.దీంతో అభ్యర్థులు దొంగ మార్కుల జాబితాను సమర్పించినట్లు సమాచారం.
- గతంలో కూడా బోగస్ సర్టిఫికెట్స్ వ్యవహారం పెద్ద దుమారమే లేపింది. ఈ వ్యవహారానికి సంబంధించి కొందరిపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వెలుగు చూస్తున్న బోగస్ సర్టిఫికెట్స్ కూడా వారిపనే అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

వారి పేర్లు తొలగించాం



బోగస్ సర్టిఫికెట్స్‌గా నిర్ధారణ అయిన అభ్యర్థుల పేర్లను ఎంపిక జాబితా నుంచి తొలగించాం. ఈ అంశాలను ఉన్నతాధికారులకు విన్నవించాం. నిబంధనల ప్రకారం అభ్యర్థు ల ఎంపిక జాబితాను సిద్ధం చేస్తాం.త్వరలోనే కౌన్సెలింగ్ చేపడతాం.

– రామగిద్దయ్య, ఆర్డీ, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

బాబు మోసాలను ఎండగడదాం



క్యూఆర్ కోడ్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు, కార్యకర్తలు

- వైఎస్ జగన్ 2.0లో బాబుకు సినిమా
- కేసులకు భయపడవద్దు... అండగా ఉంటాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా పాలన అందించారని, 2.0లో మాత్రం చంద్రబాబునాయుడుకు సినిమా చూపిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి అన్నారు. మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా అధ్యక్షతన ఆదివారం నగరంలో నిర్వహించిన ఆ పార్టీ కడప నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ఒక బుక్ చూపిస్తుంటే వైఎస్సార్ సీపీ ప్రతి కార్యకర్త ఒక్కో బుక్ చూపిస్తారంటూ హెచ్చరించారు. 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకతతో గెలువడం మనకు వద్దని, పార్టీ సంస్థాగతంగా మరింత బలం పుంజుకుని గెలవాల్సిన అవసరం ఉందన్నా రు. కేసులకు ఎవరూ భయపడవద్దని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకోవడానికి కార్యకర్తలు కష్టించి పనిచేయాలని కోరారు. హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చేస్తున్న మోసాలపై తొలుత కార్యకర్తలు అవగాహన పెంచుకుని ప్రజలకు వివరించాలన్నారు. బాబు మెడలు వంచైనా సూపర్ సిక్స్ అమలు చేయించాలన్నారు.

కార్యకర్తల నిరుత్సాహం వల్లే ఓటమి

వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో నిరుత్సాహం వల్లే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందాల్సి వచ్చిందని నగర మేయర్ కె.సురేష్‌బాబు విశ్లేషించారు. బూత్ లెవెల్ కమిటీలు బాగా పనిచేసి ఉంటే అంజద్‌బాషా గెలుపొందేవారని తెలిపారు. కార్యకర్తలకు అండగా నిలుస్తామని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క డివిజన్ కూడా టీడీపీ గెలుచుకోలేదని ధీమా వ్యక్తం చేశారు. పీ4 పేరుతో ప్రజలను మభ్య పెట్టేందుకు బాబు యత్నిస్తున్నారని, పీ4 ఆయనతోనే ప్రారంభించాలన్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. పటాకులు పేల్చిన సంఘటనలో మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలపై నక్సలైట్లు, తీవ్ర వాదులపై నమోదు చేసే ఆయుధాల కేసు బనాయించడం అక్రమమని దుయ్యబట్టారు. ప్రశ్నించే గొంతులను నొక్కడం అప్రజాస్వామికమన్నారు.

- కడప పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకు ప్రజలకు ఎంతమొత్తం అందజేసింది? ఇంకా ఎంత రావాల్సి ఉందనే విషయాలను కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, నగర అధ్యక్షురాలు సీహెచ్ దీప్తిరెడ్డి, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు కంచుపాటి బాబు, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు షఫీ, యువజన విభాగం నగర అధ్యక్షుడు నాగేంద్ర, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, జోనల్ అధ్యక్షుడు ఇలియాస్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివ ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, పులి సునీల్ కుమార్, బంగారు నాగయ్య యాదవ్, జమాల్‌వలీ, పి. రామ్మోహన్‌రెడ్డి, డా. సొహైల్, శ్రీరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో గెలుపు మనదే: అంజద్‌బాషా

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కడప నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలోనూ వైఎస్సార్‌సీపీదే గెలుపని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా ధీమా వ్యక్తం చేశారు. అన్ని డివిజన్లు టీడీపీకి ఏకగ్రీవం అవుతాయంటూ ఎమ్మెల్యే మాధవిరెడ్డి అంటున్నారని,కనీసం ఒక్క డివిజన్‌లో అయినా ఏకగ్రీవం చేసుకోవాలంటూ సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేయడం తప్ప ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి సాయం అందిస్తామని చెప్పి ఇప్పుడు షరతులు విధించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో 66 లక్షల మందికి పెన్షన్లు ఇస్తుండగా, బాబు వచ్చాక అందులో ఐదు లక్షలు తొలగించారన్నారు. ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్క దానితో సరిపెట్టడం మోసం కాదా? అని ప్రశ్నించారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


అంజాద్‌ఖాన్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జయనగర్ కాలనీలో నివాసం ఉంటున్న వనిపెంట అంజాద్‌ఖాన్ గత నెల 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతని భార్య సల్మా ఈనెల 5వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప నగర శివార్లలోని తెలుగుగంగ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఇరిగేషన్ విభాగంలో పనిచేస్తున్న అంజాద్‌ఖాన్ ఇటీవలే బదిలీపై బద్వేల్‌కు వెళ్లారు. అంజాద్‌ఖాన్ తన కుటుంబ అవసరాల కోసం, అనారోగ్య విషయమై అప్పులు ఎక్కువగా చేశారని అతని భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నెల 28న ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు కడప చిన్నచౌక్ సీఐ సెల్: 9121100520, ఎస్ఐలు 9121100521, 9121100522కుగానీ సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

బహుజన టీచర్స్ యూనియన్ ఆవిర్భావం


బహుజన టీచర్స్ యూనియన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నూతన కమిటీ సభ్యులు

కడప రూరల్ : బహుజన టీచర్స్ యూనియన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నూతన సంఘం ఆవిర్భావ సమావేశం ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా మేకల శివార్జున, ప్రధాన కార్యదర్శిగా సి.సుదర్శన్ బాబు, కోశాధికారిగా ఏ.రాజబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎం.గంగరాజు, కె.గంగాధర్, ఎం.శ్రీదేవి, ప్రేమ సాగర్ నిత్య ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడిగా గంగరాజు, కార్యదర్శిగా బేరి మోహన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా కట్టా గంగాధర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యాంటీ రేబీస్ టీకాలు వేయించాలి


వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప అగ్రికల్చర్ : జంతు ప్రేమికులు తమ పెంపుడు శునకాలకు తప్పనిసరిగా యాంటీ రేబీస్ టీకాలు వేయించి జంతు సంక్రమిత వ్యాధులను నివారించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కడప పశుసంవర్ధక శాఖ పాలీ క్లినిక్ కార్యాలయంలో ఉచిత రాబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు జూనోసిస్ (జంతు సంక్రమిత) వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 17వేల డోసులు అందుబాటులో ఉన్నాయని పెంపుడు జంతువుల ప్రేమికులందరూ వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. అనంతరం ఈ నెల 7 నుంచి 14 వరకు నిర్వహించే పశుగ్రాస వారోత్సవాల పోస్టర్లను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీ రంగస్వామి, ఇన్‌చార్జి డీడీ శ్రీనివాసరెడ్డి, ఏడీ డాక్టర్ సుబ్బరాయుడు, ఏడీ డాక్టర్ నేతాజీ, ఏడీ డాక్టర్ మాధవి, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ చాంద్ బాషా, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గండి టెండర్లలో నిబంధనలకు పాతర

- సరైన మార్గదర్శకాలు లేవంటున్న భక్తులు
- ఆలయ ఆదాయానికి గండికొడుతున్నారని ఆందోళన


గండి వీరాంజనేయ స్వామి ఆలయం(ఫైల్)

చక్రాయపేట : గండి క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా నిర్వహించే టెండర్లలో నిబంధనలకు పాతర వేసినట్లు కనిపిస్తోంది. ప్రత్యేక పూల అలంకరణకు పూలు సరఫరా, చలువ పందిళ్లు, బారికేడ్లు, విద్యుద్దీపాల అలంకరణ అని ఆలయ అధికారులు కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. ప్రతికల్లో ప్రకటనలు కూడా అలాగే ఇస్తున్నారు. అయితే ప్రత్యేక పూల అలంకరణ అంటే ఆలయానికా లేక మూలవర్లకా అనే వివరాలు పొందు పరచలేదు. దీనికి తోడు మూలవర్లకు ప్రత్యేక అలంకరణ అంటే తోమాలలు ఎన్ని అవసరం, అవి ఎన్ని కిలోల బరువు ఉండాలి, అలంకరణ బిట్లు ఎన్ని కావాలి, వాటి బరువెంత, అలాగే పలు రకాల అల్లిన పూలు ఎన్ని కావాలి.. ఏయే రకాలు కావాలి అని కాని ఆలయంలో అలంకరణకు బంతి పూలు ఎన్ని మూరలు అనో లేక ఎన్ని కిలోలు అని వివరాలు ఉండటం లేదు. అలాగే చలువ పందిళ్లు అంటే అవి ఎన్ని అడుగులు ఎక్కడెక్కడ ఎన్ని వేయాలి అనే విషయాలు ఉండటం లేదు. బారికేడ్లు, విద్యుద్దీపాలు సీరియల్ సెట్లు, ఫోకస్ లైట్లు, డిజిటల్ బోర్డులు కూడా ఎక్కడ వేయాలి ఎన్ని వేయాలి అనే వివరాలు పొందుపరచలేదు. ముందుగానే వివరాలు ఉండక పోవడంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ తక్కువ మోతాదులో తెచ్చి వేయడం, చాలక పోతే మరో వారానికి తెప్పించి వేయడం జరుగుతుంది. దీని వల్ల కాంట్రాక్టర్‌కు మేలు జరుగుతుంది కాని ఆలయ ఆదాయానికి గండి పడుతుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఏటా వేయిస్తూనే ఉన్నప్పటికీ..

శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ఏటా అధికారులు టెండర్లు వేయిస్తున్నారు. ఏవేవి ఎన్ని అవసరమో ఆ వివరాలు అన్ని కూడా ఆలయ కార్యాలయంలోనే అందుబాటులో ఉంటాయి. ఎందుకంటే గతంలో కాంట్రాక్టర్లకు చెల్లించిన బిల్లులు పరిశీలిస్తే ఈ దఫా ఏవేవి ఎన్ని అవసరం అనే విషయాలు కచ్చితంగా తెలుస్తాయి. గతంలో ఏవి ఎక్కడ వేశారో ఇప్పుడు అక్కడే వేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆలయ పరిధిలో విస్తీర్ణం తక్కువగానే ఉంది. ఈ విషయం ఆలోచించకనే దేవదాయశాఖ అధికారులు టెండర్లు పిలవడం నిబంధనలను పక్కన పెట్టినట్లేనని పలువురు భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పూల విక్రయ హక్కు టెండర్లలో చెప్పేది ఒకటి జరిగేది మరొకటి..

ఏడాది కాలం పాటు పూలు విక్రయించుకునే హక్కు విషయంలో అధికారులు చెప్పేది ఒకటయితే అనంతరం టెండరు దక్కించుకున్న వ్యక్తి చేసేది మరోలా ఉంటోంది. పూల విక్రయం అంటే పూలు, పూల దండలు మాత్రమే విక్రయించాలి. కాని ఇక్కడ వాటిని అసలు విక్రయించరు. తమలపాకులు తెచ్చి వాటిని దండలా కూర్చి దేవస్థానం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ దండలకు చివరన పూలతో కుచ్చును కూడా ఏర్పాటు చేయరు. ఈ విషయాన్ని పలువురు భక్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి. టెండర్ల సమయంలో తమలపాకుల దండల ఊసే లేకున్నా కాంట్రాక్టర్లు వాటినే విక్రయించడంపై విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

ఖాళీ స్థలం టోల్‌గేట్ల కాంట్రాక్టర్‌కు వరం

ఆలయ పరిధిలోనే గల నూతన కల్యాణ మండపం ఎదురుగా ఉన్న స్థలం టోల్‌గేట్ల కాంట్రాక్టర్‌కు వరంలా మారుతోంది. గత శ్రావణ మాసంలో ఈ ఖాళీ స్థలం టోల్‌గేట్ కాంట్రాక్టరుకు అప్పగించారు. టోల్‌గేట్ టెండర్ల సమయంలో ఈ ఖాళీ స్థలం ప్రస్తావనే లేదు. శ్రావణ మాస ఉత్సవాలు వచ్చే సరికి ఈ స్థలాన్ని సదరు కాంట్రాక్టరుకు అప్పగించారు. దీంతో ఆ కాంట్రాక్టరు ఆ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేయించి వారి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నెలకు ఒక్కో దుకాణం వద్ద నుంచి 40 నుంచి 50 వేల వరకు బేరం కుదుర్చుకొని అందులోనే 30 నుంచి 40 వరకు దుకాణాలు, హోటళ్లను ఏర్పాటు చేయించారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. అధికారులు, పాలకమండలి స్పందించి టెండర్ల వివరాలు పూలు ఎన్ని కిలోలు, ఏయే రకాలు, బారికేడ్లు ఎన్ని అడుగుల దూరం, చలువ పందిళ్లు ఎన్ని, వాటి విస్తీర్ణం ఎన్ని అడుగులు, బార్ లైట్లు ఎన్ని, ఫోకస్ లైట్లు ఎన్ని అనే వివరాలు పూర్తిగా వివరించి ఆ మేరకు టెండర్లు నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు. లేకుంటే ఆలయ ఆదాయానికి గండి పడుతుందని పేర్కొంటున్నారు.

రేపు గండిలో టెండర్లు

గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం శ్రావణ మాస ఉత్సవాలను పురస్కరించుకుని టెండర్లను నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. నెల రోజులకు సంబంధించి పూల అలంకరణ కోసం పూలు సరఫరా, విద్యుత్ దీపాల అలంకరణ, చలువ పందిళ్లు, బారికేడ్ల ఏర్పాటుకు టెండర్లు నిర్వహిస్తామన్నారు. అలాగే దేవస్థానంలో ఏడాది కాలం పాటు పూలు విక్రయించే హక్కు, టోల్ గేట్ల వసూలు, రెండు సంవత్సరాల కాలానికి షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులకు సంబంధిం టెండర్లు వేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె రూరల్ : బైక్ అదుపు తప్పి వ్యక్తి గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. మాలేపాడు పంచాయతీ దొనబైలుకు చెందిన ఆనంద (45) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలోని సందిరెడ్డిపల్లె వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన ఆనంద స్థానికుల సహాయంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చెవి కొరికేశాడు


బాధితుడికి కొంత భాగం తెగిపోయిన చెవి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ గుండాలేరు వద్ద ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అహ్మద్ అనే వ్యక్తి మల్లు శ్రీసాయి అనే వ్యక్తి చెవి కొరికేశాడు. అతని చెవి కొంత భాగం తొలగి పోయింది. శనివారం రాత్రి పీర్ల పండుగను పురస్కరించుకొని అందరూ ఒక చోట చేరడంతో పాత కక్షలు మనసులో పెట్టుకొని వాదులాటకు దిగినట్లు తెలిసింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దాడులు


ఈజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్.పి ఈ.జి. అశోక్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో గత 15 రోజుల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీస్ శాఖ జరిపిన దాడుల వివరాలను ఆయన వెల్లడించారు.

- జిల్లాలో గత 15 రోజుల్లో జూదమాడుతున్న మొత్తం 159 మందిని అరెస్టు చేసి రూ. 2,85,645 నగదు స్వాధీనం చేసుకుని 22 కేసులు నమోదు చేశామన్నారు. 9 మట్కా కేసులు నమోదు చేసి మొత్తం 16 మందిని అరెస్టు చేసి రూ. 50,570 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.
- జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి 1.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేశామన్నారు.
- జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతూ ముమ్మర దాడులు నిర్వహించి 986 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 57 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.
- జిల్లాలో కోడి పందేల కేసు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేసి రూ. 5,050 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.
- అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి మొత్తం 3 కేసులు నమోదు చేసి 13.24 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.
- అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 112 కు తెలియజేయాలని సూచించారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి ఆఫ్‌లైన్ దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కేంద్రీయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి 10,12 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మునేష్ మీనా తెలిపారు. 10వ తరగతిలో చేరే పిల్లలు 9వ తరగతిలో 55 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. అలాగే 12వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి 11వ తరగతి పరీక్షలో 55 శాతం కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి అన్నారు. పదవ తరగతిలో చేరేవారు 01-04-2009 నుండి 01-04-2011 మధ్య జన్మించి ఉండాలన్నారు. దరఖాస్తులు విద్యాలయ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మడుగులో యువకుడి గల్లంతు

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామ సరిహద్దులలో ఝరికోన ప్రాజెక్టు సమీపంలోని మడుగులో యువకుడు గల్లంతు అయినట్లు సమాచారం. పోలీసుల వివరాల మేరకు కర్నూలుకు చెందిన షేక్ ఉస్మాన్ (23)అనే యువకుడు ఆదివారం తన స్నేహితులతో కలిసి ఝరికోన ప్రాజెక్టు దగ్గరకు వచ్చాడు. సమీపంలోని మడుగులో గల్లంతు అయినట్లు పోలీసులు తెలిపారు. మడుగు సమీపంలోని దుస్తులు, చెప్పులను గుర్తించి ఉస్మాన్ అనే యువకుడు అయి ఉండవచ్చని భావిస్తున్నారు. చీకటి కావడంతో సోమవారం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. నీటిలో గల్లంతయ్యాడా లేక మరేమైనా జరిగిందా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామం, తూర్పుపల్లి క్రాస్ సమీపంలో ఇన్నోవా కారు, లారీ ఢీ కొన్న ప్రమాదంలో ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్న శేఖర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా.. శేఖర్‌రెడ్డి వండాడి గ్రామానికి తన సొంత పనుల నిమిత్తం వచ్చాడు. తిరిగి రాయచోటిలోని తన నివాసానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. దీంతో శేఖర్ రెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

బైకును ఢీకొన్న కారు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో ఆదివారం బైకును కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు స్థానిక కోదండరామస్వామి కల్యాణ వేదిక మొదటి గేటువద్ద ఉన్న కడప-చెన్నై జాతీయ రహదారిపై ఏపీ 04బిఏ 6437 నెంబరు గల బైకులో ఓబులవారిపల్లిలో బంధువుల ఇంటికి వెళ్తున్న ఎస్. సురేంద్ర, జి.ఉమాదేవి అనే దంపతులను తిరుపతి నుంచి కడప వైపు వెళ్తున్న ఏపీ21 ఏయూ 5699 నెంబరుగల ఇథియోస్ కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో సురేంద్ర కుడిచేయి, కాలు విరగ్గా, ఉమాదేవికి నడుము విరిగింది. వీరిని 108 సహాయంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

గాలివీడు : భార్య కాపురానికి రాలేదని తుపాకుల గోపాల్ (37) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు అరవీడు గ్రామం మలసానివాండ్లపల్లెకు చెందిన తుపాకుల వెంకటరమణ, రమణమ్మ దంపతుల కుమారుడు గోపాల్ మద్యానికి బానిసై భార్య రమణమ్మ, నలుగురు సంతానాన్ని నిర్లక్ష్యం చేశాడు. దీంతో అతని భార్య మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన గోపాల్ తన భార్య తిరిగి కాపురానికి రాదేమోనన్న సందేహంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

మదనపల్లె సిటీ : కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన ఆదివారం కురబలకోట మండలం సర్కారుతోపు వద్ద ఉన్న బండ్లపల్లెలో జరిగింది. బండ్లపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి (30) ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు.

ఏసీఏ అండర్-19 మల్టీ డే మ్యాచ్‌లో అనంతపురం జట్టు ఘన విజయం

డ్రాగా ముగిసిన నెల్లూరు-చిత్తూరు మ్యాచ్


5 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ వరుణ్ సాయి నాయుడు


87 పరుగులు చేసిన కర్నూలు బ్యాట్స్‌మన్ విష్ణువర్ధన్ నాయుడు


97 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ మన్విత్ రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ డే మ్యాచ్‌లో ఆదివారం మూడవ రోజు కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు 59 పరుగులతో ఘన విజయం సాధించింది. కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో రెండవ ఇన్నింగ్స్‌లో 115 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 51.1 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని విష్ణు వర్ధన్ నాయుడు 87 పరుగులు, మహిత్ 37 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని వరుణ్ సాయి నాయుడు అద్భుతంగా బౌలింగ్‌లో రాణించి 5 వికెట్లు తీశాడు. టీవీ సాయి ప్రతాప్ నాయుడు 3 వికెట్లు తీశారు. కాగా అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 486 పరుగులు చేయగా కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 213 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 214 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో అనంతపురం జట్టు 59 పరుగులతో ఘన విజయం సాధించింది.

వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ స్టేడియంలో..

అదే విధంగా వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆదివారం 63 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 87 ఓవర్లలో 384 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 97 పరుగులు, ఎస్ఎస్ హమీద్ 67, కారుణ్య ప్రసాద్ 52 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 3 వికెట్లు, తేజేష్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 10 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 48 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాకు 1వ ర్యాంకు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని వెల్లడి



కడప అర్బన్ : జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 23, 284 కేసులకు పరిష్కారం చూపి, కక్షిదారులకు రూ.34,53,61,148 చెల్లించామని, తద్వారా రాష్ట్ర స్థాయిలో వైఎస్‌ఆర్ ఉమ్మడి కడప జిల్లా మొదటి ర్యాంకును సాధించిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ డాక్టర్.సి.యామిని తెలిపారు. పరిష్కారమైన కేసుల్లో క్రిమినల్ 22, 700 కేసులు, 213 సివిల్ కేసులు, 371 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు.

కడపలో 4482 కేసులు, ప్రొద్దుటూరులో 2556 కేసులు, రాజంపేటలో 223 కేసులు, రాయచోటిలో 906 కేసులు, బద్వేల్‌లో 3652 కేసులు, మైదుకూరు కోర్టులో 1329 కేసులు, జమ్మలమడుగులో 3696 కేసులు, సిద్ధవటంలో 461 కేసులు, రైల్వేకోడూరులో 482 కేసులు, పులివెందులలో 1656 కేసులు, నందలూరులో 909 కేసులు, లక్కిరెడ్డిపల్లిలో 2100 కేసులు, కమలాపురంలో 832 కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించారని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల ఆందోళన

మూడు గంటలు ఆలస్యంగా బెంగళూరు సర్వీసు


ఆర్టీసీ ఉద్యోగితో వాగ్వాదం చేస్తున్న ప్రయాణికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నుంచి బెంగళూరుకు వెళ్లాల్సిన అమరావతి ఏసీ సర్వీసు మొరాయించడంతో ప్రయాణికులు ఆందోళన చేసిన ఘటన ఆదివారం మధ్యాహ్నం కడప బస్టాండులో జరిగింది. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు కడప నుంచి బెంగళూరుకు వెళ్లాల్సిన అమరావతి ఏసీ బస్సు మొరాయించింది. ఈ క్రమంలో బస్టాండుకు చేరుకున్న ప్రయాణికులు ఎంతసేపటికీ బస్సు రాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బస్టాండులోని కంట్రోలర్‌తో వాగ్వాదానికి దిగారు. మరోవైపు బస్సుకు మరమ్మతుల కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ఆర్టీసీ అధికారులు చేసేది లేక సాయంత్రం 6 గంటలకు ఇంద్ర సర్వీసును బెంగళూరుకు పంపించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులను సకాలంలో పంపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బస్సు సకాలంలో రాకపోవడంతో వివిధ సమస్యలు ఎదుర్కొన్నామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని వారు కోరారు.

ఉరి వేసుకుని మహిళా రైతు ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన రామాంజనమ్మ

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామానికి చెందిన మహిళా రైతు కటారు రామాంజనమ్మ(47) శనివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ చిన్నపెద్దయ్య, మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. రామాంజనమ్మ గత కొన్నేళ్లుగా భర్తతో కలసి వ్యవసాయం చేసుకుంటూ, పాడి పశువులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో వ్యవసాయంలో నష్టాలు రావడం, అప్పులు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మనస్థాపం చెందటంతో పాటు మతిస్థిమితం సరిగా లేని తన కూతురు విషయం గురించి కూడా ఆమె బాధపడేది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి


బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కడప కార్పొరేషన్ : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, దేశానికి తొలి ఉప ప్రధానమంత్రిగా బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. కార్మిక శాఖామంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్‌గా కొనసాగిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. జగ్జీవన్ రామ్ అడుగుజాడలలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు.

జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఘన నివాళి

అంతకుముందు మహవీర్ సర్కిల్‌లోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటు పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, నాయకులు పులి సునీల్ కుమార్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, దేవిరెడ్డి ఆదిత్య, షేక్ షఫీవుల్లా, రామక్రిష్ణారెడ్డి, సీహెచ్ వినోద్, చెన్నయ్య పాల్గొన్నారు.

వైభవంగా తాళ్లపాక బ్రహ్మోత్సవాలు


తాళ్లపాకలోని శ్రీ సిద్దేశ్వరాలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో శివ,కేశవుల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున అన్నమాచార్యుడు ఆరాధించి, పూజించిన శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో ఘనంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకర్, తాళ్లపాక ఆలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

శివ, కేశవుల వాహనసేవలివే : బ్రహ్మోత్సవాల తొలిరోజున శ్రీ సిద్దేశ్వర స్వామి హంసవాహనంపై, శ్రీ చెన్నకేశవస్వామి శేషవాహనంపై విహరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈఓ ప్రశాంతి పర్యవేక్షణలో తాళ్లపాక, నందలూరులో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

భరత నాట్యంలో కలికిరి వాసికి బంగారు పతకం

కలికిరి : తమిళనాడు రాష్ట్రం సేలంలో ఎస్ఏఎస్ ఈవెంట్స్, కైలాస మానస సరోవర స్కూల్ ఆధ్వర్యంలో నటరాజ నర్తనం ప్రపంచ భరతనాట్య పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ దేశాలతో పాటు, జాతీయ స్థాయిలో పలు రాష్ట్రాల నుంచి 3వేల మంది ప్రదర్శకులు హాజరై 30 నిమిషాల పాటు ఒకే సారి ఏకధాటిగా నృత్య ప్రదర్శన చేసి, నటరాజ స్వామికి నాట్య నీరాజనాన్ని సమర్పించారు. దీంతో ఈవెంట్ ప్రపంచ రికార్డులకెక్కింది. కార్యక్రమానికి జిల్లా నుంచి కలికిరి పట్టణానికి చెందిన షేక్ రియాజుల్లా(పండు) హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన తమిళ నటి ప్రియదర్శిని ఈయనకు బంగారు పతకాన్ని అందజేసి అభినందించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్

పులివెందుల రూరల్ : మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మురళి నాయక్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత నెల 30వ తేదీన బోనాల హసీనా అనే మహిళను హత్య చేశారన్నారు. రెండు రోజుల తర్వాత దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దేవిరెడ్డి లిఖిత్ కుమార్ రెడ్డిని విచారించామన్నారు. విచారణలో హసీనా వడ్డీ వ్యాపారం చేస్తూ ఉండేదని, ఈ నేపథ్యంలో కరుణ కుమారికి డబ్బులు ఇచ్చిందన్నారు. రెండేళ్లవుతున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో డబ్బులు ఇవ్వాలని కఠినంగా అడగడంతో కరుణ కుమారి కుమారుడు లిఖిత్ కుమార్ రెడ్డి గొంతు, చేతుల మీద కత్తితో పొడిచి చంపాడన్నారు. ఈ హత్యకు ప్రోత్సహించిన కరుణ కుమారిపై కూడా కేసు నమోదు చేశామని, ఆమె పరారీలో ఉందని త్వరలో అరెస్టు చేస్తామన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉల్లిమెల్ల రింగ్ రోడ్డులో ట్రాఫిక్ సీఐ హాజీవలీ, ఎస్ఐ నారాయణలు పోలీస్ సిబ్బందితో కలిసి లిఖిత్ కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు.